మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

13.1.2026 మంగళవారం Tuesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 265 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## మకర సంక్రాంతిపై వివాదం

సంక్రమణం 14నే అంటున్న కొందరు



4

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఇట్లు...
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# అశాస్త్రీయంగా జిల్లాల విభజన

## వాటిని సరిదిద్ది పాలనాపర ఇబ్బందులు తొలగిస్తాం

- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- టీజీఓ డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్



**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పాటును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పా టు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం విమర్శించారు. జిల్లాల సరిహ ద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.

మిగతా 2 లో

### చలానా పడగానే..
## ఖాతాలో కట్ కావాలి

ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి

అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సీఎం

# జెన్-జెడ్‌లో ఎంతో సృజనాత్మకత

- 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తితో ఈ వేదికను ప్రారంభించినట్లు వెల్లడి
- యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వెల్లడి

నేను ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానమంత్రిగా ఉన్నా దేశ యువతపై తనకు ఎప్పుడూ మంచి విశ్వాసం ఉ ంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన జెన్-జెడ్ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ఆయన ప్రశంసించారు.



## అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

పతంగులు ఎగురవేసిన ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్సలర్

# పీఎస్ఎల్వీ-సి62 ప్రయోగం విఫలం

## సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

**జనతా న్యూస్, శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సోమవారం షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన పీఎస్ఎల్ వీ-సి62 రాకెట్ ప్రయోగం అనుకోని సాంకేతిక లోపంతో విఫలమైంది. ప్రయోగం ప్రారంభమైన 8 నిమిషాల 42 సెకన్ల అనంతరం రాకెట్ తొలి మూడు దశలను విజయవంతంగా పూర్తి చేసుకుని నాలుగో దశలోకి ప్రవేశించిన సమయంలో సమస్య తలెత్తినట్లు ఇస్రో వెల్లడించింది. నాలుగో దశలో ప్రయాణిస్తున్న



మిగతా 4 లో

### పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై
# సుప్రీం విచారణ

- విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి
- తెలంగాణకు సుప్రీం సూచన
- కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2




# పేదల భూములకు రక్షణ



- భూములు అమ్మి డబ్బులు జమచేసుకునే ఆలోచన లేదు
- కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన

3




### సర్కారు ఉద్యోగులకు
## సంక్రాంతి కానుక

డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ

హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగలోకం

.. వివరాలు 2లో



### బీఆర్ఎస్ మాజీ
## ఎమ్మెల్యేకు షాక్

- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన 5 కోట్ల ఆస్తులు సీజ్ చేసిన ఐటీ శాఖ

3



# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

## ఎరువుల ఇవ్వలేని వాడు.. ఏం ఉద్ధరిస్తాడు

- గెలిచిన సర్పంచ్‌తో కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం
- ఆనాటి వైభవం కాలగర్భంలో కలిసిందని విమర్శలు

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువలే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు.

3



# యూరియా వాడకం తగ్గించండి

**రైతులకు మంత్రి తుమ్మల సూచన ■ డ్రోన్ స్ప్రేను ప్రారంభించిన మంత్రి**

**ఖమ్మం, జనవరి 12:** పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినయోగం తగ్గిస్తే ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్ కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాతలందరికీ అధికారులు డ్రోన్ల మీద అవగాహన కల్పించాలని సూచించారు. తాను పంటలకు యూరియా వేయనని, యూరియా వేయకపోతే పురుగుమందు వాడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. యూరియా ఎంత కావాలంటే అంత ఇస్తామని, కానీ అది పంట చేలకు అరిష్టమని తెలిపారు. ప్రతిపక్షాలు యూరియా మీద పబ్బం గడపాలని చూస్తున్నాయని విమర్శలు గుప్పించారు. పామాయిల్, కొబ్బరికి డ్రోన్ అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మిషన్లు కనిపెట్టాలని శాస్త్రవేత్తలను కోరారు. అన్ని దేశాల్లో మన దేశం నంబర్ వన్ అని, అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్ర నంబర్ వన్‌గా ఉండాలనేదే తన ఆకాంక్షని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

**డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్, జనవరి 12:** సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుంది. సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

# నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పిటిషన్

**సుప్రీంలో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ**

**సుప్రీం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అధికారిక ప్రకటన**



**న్యూఢిల్లీ, జనవరి 12:** నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు. పిటిషన్ ఉపసంహరణ నేపథ్యంలో కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వానికి సీజేఐ కీలక సూచనలు చేశారు. నల్లమల సాగర్ అంశంపై రిట్ పిటిషన్ ద్వారా ముందుకు వెళ్లడం ప్రయోజనకరం కాదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు రిట్ పిటిషన్ సరైన మార్గం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లమలసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వాదనలు, అభ్యంతరాలను వినిపించాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించారు. అదే సరైన న్యాయపరమైన మార్గమని అభిప్రాయపడ్డారు. తెలంగాణా ప్రభుత్వం పిటిషన్ ఉపసంహరించుకోవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ ఆఫ్ చేసినట్లు ఆయన ప్రకటించారు. దీంతో భవిష్యత్తులో సివిల్ సూట్ రూపంలో ఈ అంశం మరోసారి కోర్టు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టుపై తెలంగాణా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తన పిటిషన్‌లో పేర్కొంది. చట్టపరంగా మరింత పటిష్ఠంగా వ్యవహరించాలనే సుప్రీంకోర్టు సూచనతో తెలంగాణా ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకుంది. కేవలం పాలనాపరమైన ఉత్తర్వుల కోసం కాకుండా, శాశ్వత పరిష్కారం కోసం సివిల్ సూట్ ద్వారా న్యాయపోరాటం చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గోదావరి జలాల తరలింపుపై ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన వాదనలు వినిపించే అవకాశం ఉంటుందని సర్కార్ భావిస్తోంది.

# అశాస్త్రీయంగా జిల్లాల విభజన



మొదటి పేజీ తరువాయి

ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం వెల్లడించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని.. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కమిషన్ ఆరు నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, బ్జడెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ సారథులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'మా ప్రభుత్వ వారదులు.. సారథులు ప్రభుత్వ ఉద్యోగులే. ఆనాడు ప్రభుత్వం తప్పుడు పనులను ఉద్యోగులపై ఒత్తిడి చేసి అమలు చేయించింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'నేను అన్నగా వచ్చాను. ఇప్పుడు నేను 18 గంటలు పనిచేస్తున్నాను. ఈరోజు డీఏ ఫైల్ మీద సంతకం చేసి వచ్చాను. దీంతో ప్రభుత్వానికి రూ.227కోట్ల భారం పడుతుంది' అని రేవంత్ రెడ్డి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ ఉద్యోగికి రూ.1.02 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు. ఇద్దరం కలిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి' అని సీఎం అన్నారు. అలాగే, భూములు, ఇసుక, ఉ÷ు సబ్సిడీలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని నిరోధిస్తే ప్రభుత్వ ఆదాయం మెరుగవుతుందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12వేల కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయి. పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. సరిగా వసూళ్లు చేస్తే చాలు'అని అన్నారు.

# దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం

**హైదరాబాద్, జనవరి 12:** దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 కోట్లతో పరికరాలను అందించామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15శాతం కోత విధిస్తాం. ఈ బ్జడెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నాం. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలి. కన్నవారి పట్ల బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని రేవంత్ అన్నారు. దివ్యాంగులు ఒకరినొకరు



పెళ్లి చేసుకుంటే రూ.2లక్షల సాయం చేస్తామని ప్రకటించారు. వారిని ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తాం. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించు కుంటూ ఎదగాలి. ఈ ప్రాంతంలో ప్రత్యేక ప్రతిభావంతులకు జైపాల్ రెడ్డి స్ఫూర్తి. మా ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులను కోరుతున్నా. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలి. ట్రాన్స్‌జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుంది దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన జరిగింది. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి. మా ఒత్తిడితోనే కేంద్రం కులగణన చేస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ

- **విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి**
- **తెలంగాణకు సుప్రీం ధర్మాసనం సూచన**
- **కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్**



**న్యూఢిల్లీ, జనవరి 12:** పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించుకోవచ్చని అభిప్రాయపడింది. అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మరోసారి వాదనలు వినిపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదించిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# చలానా పడగానే.. ఖాతాలో కట్ కావాలి

**ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి**

**అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సీఎం**

**హైదరాబాద్, జనవరి 12:** వాహనాలకు చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. అవి ఎంతో కాలం పెండింగ్‌లో లేకుండా వెంటనే వారి ఖాతాల నుంచి కట్ అయ్యేలా చూడాలన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చినప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి కట్ కావాలని రేవంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం అన్నారు. ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు. అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జనవరి 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొన్న ప్రభాకర్, డిజిపి శివధర్ రెడ్డి, సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా పనిదినాలు.. కూలీ అమలు

- గుంతలు తవ్వే కార్యక్రమానికి చెల్లుచీటీ
- వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు
- జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు
- పాక్, బంగ్లాలో హిందూ మహిళలను ప్రధానిని చేయమంటారా
- ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్



**హైదరాబాద్, జనవరి 12:** వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ-జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

- ఎరువుల ఇవ్వలేని వాడు.. ఏం ఉద్ధరిస్తాడు
- గెలిచిన సర్పంచ్‌లతో కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం
- ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు



**మహబూబ్‌నగర్, జనవరి 12:** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువులే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసింర్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్లుండె, ఇప్పుడు ఎట్లున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్ల ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసింర్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు. 'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండె, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.

# పేదల భూములకు రక్షణ కల్పిస్తాం

**కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన**




**హైదరాబాద్, జనవరి 12:** తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్టార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీల్లో.. 40 ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

**వీటి నిర్వహణ బాధ్యత పూర్తిగా కలెక్టర్లదే**
**వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, జనవరి 12:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమానత్వం, సమగ్ర విద్యా అవకాశాలు అందరికీ అందుబాటులోకి రావాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా ఈ స్కూల్స్ రూపకల్పన చేస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా-కరిక్యులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ స్కూల్స్ దోహదపడతాయని రేవంత్ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 105కి పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబడుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున స్కూల్స్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. బ్జడెట్‌లో రూ. 11,600 కోట్లు, మరిన్ని దశల్లో రూ. 21,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా కుల, మత, ఆర్థిక వివక్షలు తొలగి, అందరూ ఒకే వేదికపై చదువుకునే అవకాశం లభిస్తుంది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను సమానత్వ సాధనంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇవి కేవలం భవనాల నిర్మాణం కాదు.. సమాజంలో సామరస్యం, సమాన అవకాశాలు, భవిష్యత్ తరాల బలోపేతం కోసం చేపట్టిన విప్లవాత్మక అడుగని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.




# సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

**పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లీయర్**
**అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు ద్రోహం**
**మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ**

**హైదరాబాద్, జనవరి 12:** రేవంత్‌రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయంపై హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు. నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు. సివిల్ సూట్ ల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు. బలహీనమైన రిట్టు వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురు దక్షణ చెల్లించుకున్నాడని విమర్శించారు. గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పుకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు షాక్

**5 కోట్ల ఆస్తులు సీజ్ చేసిన ఐటీ శాఖ**




**జనగామ, జనవరి 12:** జనగామ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన రూ. 5కోట్ల విలువైన ఆస్తులను ఐటీ అధికారులు అటాచ్ చేశారు. బినామీ యాక్ట్ కింద సిద్ధిపేట, జనగామలో ఆయనకు చెందిన పలు విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ అధికారులు సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తన కుమార్తె తుల్జా భవానీ రెడ్డి పేరు మీద జనగామ, సిద్ధిపేటలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పలు భూములు కొనుగోలు చేశారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఐటీ అధికారులు రంగంలోకి దిగి.. ఆ దిశగా విచారణ చేపట్టారు. తన కుమార్తెను బినామీగా పెట్టి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులకు పలు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో ఈ భూముల కొనుగోలుపై యాదగిరిరెడ్డి కుమార్తె తుల్జా భవానీరెడ్డిని విచారించారు. ఈ భూములు కొనుగోలు చేసేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందంటూ తుల్జా భవానీ రెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో తనకు తెలియదని ఐటీ అధికారులకు ఆమె వెల్లడించింది. తన తండ్రి సంతకం పెట్టమని చెబితేనే.. తాను ఈ భూములకు చెందిన సేల్ డీడ్‌పై సంతకం చేశానంటూ ఐటీ అధికారులకు తుల్జా భవానీ దేవి వివరించారు. ఆమె చెప్పిన స్టేట్‌మెంట్‌ను ఐటీ శాఖ ఉన్నతాధికారులు రికార్డు చేశారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా సిద్ధిపేట, జనగామలో రూ. 5కోట్లు విలువైన ఆస్తులను ఐటీ శాఖ అధికారులు ఫ్రీజ్ చేశారు.

# రోశయ్య సతీమణి కన్నుమూత

**హైదరాబాద్, జనవరి 12:** దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి కొణిజేటి శివలక్ష్మి(86) కన్నుమూశారు. ఆమె మరణం తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపింది. శివలక్ష్మి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ అమీర్‌పేటలోని తన నివాసంలో కన్నుమూశారు. శివలక్ష్మి మరణం వారి కుటుంబంలోనే కాకుండా, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర విషాదం నింపింది. శివలక్ష్మి మరణ వార్త తెలియగానే తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అమీర్‌పేటలోని రోశయ్య నివాసానికి అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్నారు. రోశయ్యకు శివలక్ష్మి అండగా ఉంటూ, ఆయన రాజకీయ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారని బంధుమిత్రులు తెలిపారు. రోశయ్య సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పినప్పటికీ.. శివలక్ష్మి తెర వెనకే ఉంటూ కుటుంబాన్ని చక్కదిద్దేవారని బంధుమిత్రులు చెబుతున్నారు.

# పీజేఆర్‌కు సీఎం నివాళి



**హైదరాబాద్, జనవరి 12:** దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పీ జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ సర్కిల్‌లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పీజేఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయనప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీజేపీ తనయ విజయా రెడ్డి,మంత్రి దామోర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పీజేఆర్‌కు నివాళి అర్పించారు.

# జెన్-జెడ్‌లో ఎంతో సృజనాత్మకత

**'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

**వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తితో ఈ వేదికను ప్రారంభించినట్లు వెల్లడి**

**యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వెల్లడి**

న్యూఢిల్లీ: నేను ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానమంత్రిగా ఉన్నా దేశ యువతపై తనకు ఎప్పుడూ మంచి విశ్వాసం ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన జెన్-జెడ్ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ఆయన ప్రశంసించారు. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొంది 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ వేదికను స్థాపించినట్లు తెలిపారు. వినూత్న ఆలోచనలు, లక్ష్యాలు, ఉత్సాహంతో దేశ నిర్మాణంలో జెన్-జెడ్ ముందు వరుసలో ఉందని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. ఈ క్రమంలోనే దేశంలో స్టార్టప్ విప్లవం ఊపందుకుందని అన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రారంభించిన సంస్కరణల పరంపర ఇప్పుడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా మారిందని, వీటికి కేంద్ర బిందువు యువతే అని ఆయన స్పష్టం చేశారు. దేశ యువతకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ వేదికను రూపొందించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి పైగా యువత పాల్గొన్నారు.

# పీఎస్‌ఎల్‌వీ-సి62 ప్రయోగం విఫలం



**మొదటి పేజీ తరువాయి**



సమయంలో రాకెట్ గమనం స్పష్టంగా తెలియకపోవడంతో పాటు, శాటిలైట్ కమ్యూనికేషన్ అకస్మాత్తుగా గ్రౌండ్ స్టేషన్లతో కట్ ఆఫ్ అయింది. దీంతో రాకెట్ దిశపై స్పష్టత కోల్పోయిన శాస్త్రవేత్తలు వెంటనే అప్రమత్తమయ్యారు. క్షణాల్లోనే మిషన్ కంట్రోల్‌లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ మాట్లాడుతూ, "రాకెట్ తొలి మూడు దశలు పూర్తయ్యాయి. అయితే నాలుగో దశలో ప్రయాణిస్తున్న సమయంలో గమనం స్పష్టంగా తెలియకపోవడంతో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ అందకపోవడం వల్ల ప్రయోగం విఫలమైంది" అని తెలిపారు. ప్రయోగం విఫలానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు లోతైన పరిశీలన చేపట్టినట్లు చైర్మన్ చెప్పారు. పూర్తి సాంకేతిక వివరాలను విశ్లేషించిన అనంతరం మీడియాకు సమగ్ర సమాచారం అందిస్తామని ఆయన వెల్లడించారు. ఇస్రో చరిత్రలో ఎన్నో విజయవంతమైన ప్రయోగాలు ఉన్నప్పటికీ, ఈసారి ఎదురైన సాంకేతిక సవాల్‌ను కూడా శాస్త్రవేత్తలు సమర్థంగా అధిగమిస్తారనే నమ్మకం వ్యక్తమవుతోంది.

# ఎస్‌బీఐ ఏటీఎం ఛార్జీల పెంపు

**న్యూఢిల్లీ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బిఐ ఇటీవల ఎటిఎం ట్రాన్సాక్షన్ ఛార్జీలను పెంచింది. ఇంటర్‌ఛేంజ్ ఫీజ్ పెరిగిన నేపథ్యంలో ఈ పెంపు అనివార్యమైందని బ్యాంకు ప్రకటించింది. కొత్త ఛార్జీలు డిసెంబర్ 1నుంచి అమలులోకి వచ్చాయి. ఇదే తరహాలో గతేడాది ఫిబ్రవరి తర్వాత కూడా ఛార్జీలు పెంచిన సంగతి తెలిసిందే. సేవింగ్స్ అకౌంట్ హోల్డర్లు: ఇతర బ్యాంకుల ఎటిఎంలలో నెలకు 5 ఫ్రీ ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు. ఫ్రీ లిమిట్ అయిపోయాక.. క్యాష్ విత్‌డ్రాయల్ కు రూ.23 చొప్పున వసూలు చేస్తారు. ఇక, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్-÷నాన్షియల్ లావాదేవీలకు రూ.11 ఛార్జీలుగా వసూలు చేస్తారు. శాలరీ అకౌంట్ హోల్డర్లకు గతంలో అన్‌లిమిటెడ్ ఫ్రీ ట్రాన్సాక్షన్లు ఉండేవి. ఇప్పుడు నెలకు 10 ఫ్రీ ట్రాన్సాక్షన్లు మాత్రమే కల్పించారు. దాని తర్వాత సేవింగ్స్ ఖాతాదార్ల మాదిరే రూ.23 ,ఇంకా రూ. 11 చెల్లించాలి. అయితే, సొంత ఎటిఎంలలో ఛార్జీలు మారలేదు. ఫ్రీ ట్రాన్సాక్షన్లూ పాత పద్ధతిలో అలాగే ఉన్నాయి. సేవింగ్స్ ఇంకా శాలరీ అకౌంట్ హోల్డర్లు ఫ్రీ లిమిట్ దాటినప్పుడు మాత్రమే ఎక్స్‌ట్రా ఛార్జీలు చెల్లించాలి. కరెంట్ అకౌంట్ హోల్డర్లు కూడా ఛార్జీల పెంపునకు ప్రభావితమవుతారు.

## పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు నిధులు విడుదల

**అమరావతి :** ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఏపీ సర్కార్ సంక్రాంతి కానుక ఇచ్చింది. డీఏ, వివిధ రకాల పెండింగ్ బిల్లులను ఆర్థిక శాఖ క్లియర్ చేసింది. డీఏ, డీఆర్ ఎరియర్స్, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు రూ.2,653 కోట్ల నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్ ఎరియర్స్ కోసం రూ.1,100 కోట్లు, పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవులకు రూ.110 కోట్లు, ఈఏపీ, నాబార్డ్, సాస్కీ, సీఆర్‌ఐఎఫ్ పనులకు రూ.1,243 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొత్తం 5.7 లక్షల మందికి లబ్ది చేకూరనుంది.

# అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

## పతంగులు ఎగురవేసిన ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్సలర్




**అహ్మదాబాద్, జనవరి 12:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ పతంగుల పండుగను ప్రారంభించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదీ తీరంలో ప్రధాని సోమవారం అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ వేడుకలో ప్రధాని మోదీతో పాటు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ కూడా పాల్గొన్నారు. ఇద్దరూ కలిసి పతంగులను ఎగురవేశారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్‌లో కలియ తిరిగారు. ఈ ఉత్సవంలో 50 దేశాలకు చెందిన ఔత్సాహికులు పాలుపంచుకున్నారు. ఈ వేడుకలో హనుమాన్ పతంగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతేడాది ఈ ఫెస్టివల్‌కు 3.83 లక్షల మంది సందర్శకులు హాజరయ్యారు. ఈ ఏడాది సందర్శకులు సంఖ్య 5 లక్షల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# భారత్ మాకు నిజమైన భాగస్వామి

- నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమే
- అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు





**న్యూఢిల్లీ, జనవరి 12:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహబంధం నిజమైనదని అన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగేందుకే వారు ప్రయత్నిస్తారని వ్యాఖ్యానించారు. 'ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఎవరూ ఎక్కువ కాదు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తాను' అని గోర్ చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. ఈనెల 13న భారత్-అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కావాల్సి ఉందని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌కు అమెరికా రాయబారిగా ఆయన సోమవారంనాడు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద దేశమని, అందువల్ల ఒప్పందంపై ముగింపునకు తీసుకురావడం అంత తేలికైన పనికాదని, అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఒప్పందం కుదిరేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. భద్రత, కౌంటర్ టెర్రరిజం, ఇంధనం, సాంకేతికత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు. సిలికాన్ ఆధారిత సాంకేతికతలను రక్షించడానికి, మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'ప్యాక్స్ సిలికా' కూటమిలోకి పూర్తి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానిస్తున్నామని గోర్ వెల్లడించారు. కూటమిలో అమెరికా, జపాన్, సౌత్ కొరియా, యూకే, ఇజ్రాయెల్ దేశాలు కలిసి పనిచేయనున్నట్టు చెప్పారు.

# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు

## బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం



**కోల్‌కతా, జనవరి 12:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ ం ంో ని ా రి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ పక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్‌ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఎస్‌ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు. ఈ పక్రియలోనే లోపం ఉంది. ఎస్‌ఐఆర్ విచారణ పక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో ఎస్‌ఐఆర్‌లో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఈసీ తొలగించిన విషయం తెలిసిందే.

# మకర సంక్రాంతిపై వివాదం

## సంక్రమణం 14నే అంటున్న కొందరు



**తిరుమల, జనవరి 12:** పండగల తేదీలపై ఏటా కొన్ని విభేదాలు వస్తూనే ఉన్నాయి. ఏ రోజు ఏ పండగ అన్నది వివాదాలకు దారితీస్తోంది. తాజాగా సంక్రాంతి పర్వదినంపైనా కొంత చర్చ మొదలయ్యింది. మకర సంక్రాంతి.. ఏడాదిలో వచ్చే తొలి పండగే కాదు. అతి పెద్ద పండగల్లో ఇది కూడా ఒకటి. ఈ ఏడాది ఈ మకర సంక్రాంతి పండగ జనవరి 14 లేదా 15వ తేదీన జరుపుకోవాలా? అనే సందేహం చాలా మందిలో కలుగుతోంది. అదీకాక చాంద్రమానం ప్రకారం ఏడాదిలో దాదాపు అన్ని పండగలు జరుపుకుంటాం. కానీ సౌరమానం ఆధారంగా సంక్రాంతిని జరుపుకుంటాం. ఇంకా చెప్పాలంటే.. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర ఘడియలనే మకర సంక్రాంతిగా అంతా పరిగణిస్తారు. ఈ ఏడాది 14వ తేదీన పవిత్ర స్నానాలు, దానధర్మాలు, సూర్య ఆరాధన చేయాలని పండితులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని సంప్రదాయ పంచాంగాలు సూర్యోదయం ఆధారంగా నియమాలను అనుసరిస్తాయి. సూర్యుడు సాయంత్రం చాలా ఆలస్యంగా లేదా సూర్యాస్తమయం తర్వాత మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. దాంతో పండగ మరుసటి రోజు జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది జనవరి 14వ తేదీ మధ్యాహ్నమే ఈ మార్పు జరుగుతుంది. దాంతో ఈ పండగ బుధవారం అంటే.. జనవరి 14వ తేదీనే జరుపుకోవాలని అంటున్నారు. దీని ప్రకారం మకర సంక్రాంతి వేడుకలకు జనవరి 14వ తేదీగా నిర్ణయించారు. ఆరోజు మధ్యాహ్నం 3.13 గంటలకు సంక్రాంతి ముహూర్తం వస్తుంది. ఈ నేపథ్యంలో ఆ రోజే పండగ జరుపుకోవాలని,. అంటే జనవరి 15వ తేదీ కాదన్నది సుస్పష్టం. అయితే ఇప్పటికే మకరసంక్రాంతి 15గా నిర్ణయించారు. ప్రభుత్వం కూడా అదేరోజు సెలవుగా పరిగణించింది. మకర సంక్రాంతి వేళ.. సూర్యుడు దక్షిణాయణం ముగించుకుని.. ఉత్తరాయణం దిశగా ప్రారంభాన్ని సూచిస్తుంది. సూర్య భగవానుడి ప్రయాణ మార్పు ఆశ, కాంతి, సానుకూల శక్తిని తెస్తుందని అంతా ప్రగాఢంగా విశ్వసిస్తారు. ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు సూర్యుడిని పూజిస్తారు. పేదవారికి వస్త్రాలు దానం చేస్తారు. తమిళనాడులో పొంగల్‌గా ఈ పండగను జరుపుకుంటారు. ఇది అనేక రోజుల పంట పండగా వారు భావిస్తారు. అసోంలో మాఘ్ బిహుగా జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో: పౌష్ పర్బన్ అని ఈ పండగను పిలుస్తారు. అయితే ఈ పండగ పేర్లు, ఆచారాలు భిన్నంగా ఉన్నప్పటికీ అన్ని వేడుకలు పంట శ్రేయస్సుతోపాటు కృతజ్ఞతతో ముడిపడి ఉంటాయి.

# డ్రోన్‌లతో సరిహద్దుల్లో పాక్ కవ్వింపులు

- తిప్పికొట్టిన సైన్యం



**శ్రీనగర్:** భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'తో కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న పాకిస్థాన్ మరోసారి కవ్వింపులకు దిగింది. జమ్మూకశ్మీర్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్వోసీ) వెంబడి రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా ఐదు డ్రోన్లు సంచరిస్తున్నట్టు భారత సైన్యం గుర్తించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు వాటిని తిప్పికొట్టాయి. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తినష్టం కానీ, ప్రాణనష్టం కానీ జరగలేదు. భారత సైనిక వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్థాన్ ఆర్మీకి చెందిన కొన్ని డ్రోన్లు ముఖ్యంగా నౌషెరా-రాజౌరీ సెక్టార్‌లో సంచరిస్తున్నట్టు గుర్తించారు. దీంతో వెంటనే సైనిక విభాగాలు ఆపరేషన్ ప్రారంభించాయి. మీడియం, లైట్ మిషన్‌గన్‌లతో కాల్పులు జరిపాయి. పాక్ డ్రోన్ కదలికలతో ఎల్‌ఓసీ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భద్రత, నిఘాను మరింత కట్టుదిట్టం చేశామని, భారత బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని సెక్యూరిటీ అధికారులు చెప్పారు. గత ఏడాది మే 7న పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పలు పాక్ డ్రోన్లను కూల్చేసింది. అప్పటి నుంచి డ్రోన్ల సంచారం తగ్గింది. అయితే తిరిగి డ్రోన్ల కదలికలు కనిపించడంతో ఉగ్రవాద గ్రూపులకు మద్దతుగా మాదక ద్రవ్యాలు, ఆయుధాలు జారవిడిచేందుకు డ్రోన్లను ఉపయోగించినట్టుగా అనుమానిస్తున్నారు. దీంతో భద్రతా బలగాలు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
Regional
మంగళవారం 13 జనవరి 2026


# "స్మార్ట్ ఫోన్ కాదు.. స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి"

**జాతీయ యువజన దినోత్సవంలో యువతకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**




కరీంనగర్, జనవరి 12 (జనతా న్యూస్): "స్మార్ట్ ఫోన్‌కు పరిమితం కావొద్దూ స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి. వైఫై కాదూ విల్ పవర్ పెంచుకోండి. ప్రశ్నించే ధైర్యం, అన్యాయాన్ని ఎదిరించే శక్తిని పెంచుకోండి. మీ కోసం కాదూ దేశం కోసం పనిచేయండి" అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ యువతకు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కళాభారతిలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి చేతుల మీదుగా పలువురికి స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ, భారత దేశ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన మహనీయుడు స్వామి వివేకానంద అని, నిరాశలో ఉన్న యువతను తట్టి లేపే ఆయన మాటలు నేటికీ తారక మంత్రాలుగా పనిచేస్తున్నాయని అన్నారు. "నీ వెనుక ఏముంది, ముందేముంది అనేది కాదూ నీలో ఏముంది అనేదే ముఖ్యం" అనే స్వామిజీ సందేశం యువతలో ప్రత్యేకతను వెలికితీయడానికి దోహదపడుతుందన్నారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం గల యువత 100 మంది ఇస్తే దేశ తలరాతనే మార్చేస్తాను" అన్న మాటలే భారతీయ యువత శక్తిపై ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి యువత మొబైల్, ఇంటర్నెట్, ఆన్‌లైన్ గేమ్స్, మద్యం, డ్రగ్స్‌కు బానిసలవుతున్న పరిస్థితి బాధాకరమని, విదేశీ కల్చర్ పేరుతో విలువలను కోల్పోకూడదని సూచించారు. "ఈ దేశానికి బలహీనులు కాదూ బలవంతులు కావాలి" అని పేర్కొంటూ, దేశం కోసం నిలబడే ఆలోచనను మనసునిండా నింపుకోవాలని అన్నారు. "వికసిత్ భారత్--2047" విజన్‌తో దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని, ఆర్థికంగా భారత్ 11వ స్థానంనుంచి 4వ స్థానానికి ఎదిగిందని తెలిపారు. యువత అభివృద్ధి, సంక్షేమం, క్రీడలకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, క్రీడల బడ్జెట్‌ను గణనీయంగా పెంచి ఒలింపిక్స్, కామన్వెల్త్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలు సాధించేలా చేశామని వివరించారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, పీఎంకేవై వంటి పథకాల ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడాలని, డ్రగ్స్-మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాంటి అక్రమాలకు సంబంధించిన సమాచారం ప్రభుత్వానికి అందించాలని పిలుపునిచ్చారు. "మీలోని బలహీనతలను విడిచిపెట్టండి, భయాన్ని మనసులోకి రానీయకండి. భారతీయుడిగా గర్వంగా నిలబడండి---అదే స్వామి వివేకానందుడికి మనం అందించే నిజమైన నివాళి" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా యువజన అధికారి రాంబా బు, జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో మున్సిపల్ కమిషనర్ సతీమణి ప్రసవం

**ప్రభుత్వ వైద్యంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనం**



కరీంనగర్, జనవరి 13 (జనతా న్యూస్): ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకు పెరుగుతున్నదానికి కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో జరిగిన సంఘటన స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది. కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ఐఏఎస్ అధికారి ప్రఫుల్ దేశాయ్ సతీమణి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మాత--శిశు కేంద్రంలో పండంటి పాపకు జన్మనిచ్చారు. గర్భవతిగా ఉన్న కమిషనర్ సతీమణిని ఆదివారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేర్పించగా, ఉమ్మనీరు తగ్గడంతో మాత--శిశు కేంద్రంలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచారు. సోమవారం అనుభవజ్ఞులైన గైనకాలజిస్టుల పర్యవేక్షణలో ఆపరేషన్ ద్వారా డెలివరీని విజయవంతంగా నిర్వహించారు. నిపుణులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో ప్రసవం సజావుగా పూర్తయ్యింది. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ ప్రసవానికి హెచ్ఓడీ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజతో పాటు గైనకాలజిస్టులు, పిల్లల వైద్య నిపుణులు, అనస్థీషియా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సేవలందించారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోనే ఉన్నతాధికారి కుటుంబ సభ్యులకు అత్యుత్తమ వైద్యం అందడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలోపేతాన్ని సూచిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. మున్సిపల్ కమిషనర్ దంపతులు ప్రభుత్వ ఆస్పత్రినే ఎంచుకోవడం ఆదర్శంగా నిలిచిందని, దీని ద్వారా ప్రభుత్వ వైద్యంపై సామాన్య ప్రజల్లో మరింత ధైర్యం, నమ్మకం పెరుగుతుందని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, సిబ్బంది మున్సిపల్ కమిషనర్ దంపతులకు అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జండానే ఎగురుతుంది : గంగుల కమలాకర్



**ఈ నెల 19న కరీంనగర్‌కు కేటీఆర్ -- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో నేతల పిలుపు**

కరీంనగర్, జనవరి 12 (జనతా న్యూస్): రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఘన విజయం వైపు నడిపించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ నగరంలోని చింతకుంటలో గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న కరీంనగర్‌లో నిర్వహించనున్న సర్పంచుల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో పార్టీ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్, జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండిలో గత 45 ఏళ్లలో జరగని అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి పనులే రాబోయే ఎన్నికల్లో తమ ప్రధాన ఆయుధమని, ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కే ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో మరోసారి నిరూపించాలని అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలు వచ్చాయని, అదే జోరు మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వి. సతీష్ కుమార్, సుంకే రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్ రావు, కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణ రావు, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్‌లతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహణ

**ఫైనల్ ఫోటో ఎలక్టోరల్ రోల్స్ ప్రచురణ పూర్తి : కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



కరీంనగర్, జనవరి 13 (జనతా న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనల మేరకు కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. కమిషనర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లకు సంబంధించి ముసాయిదా ఫోటో ఎలక్టోరల్ రోల్స్‌ను జనవరి 1న ప్రచురించి, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించామని తెలిపారు. ఈ ప్రక్రియలో మొత్తం 249 అభ్యంతరాలు వచ్చాయని, వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించినట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల ఆధారంగా వార్డు వారీగా ఓటర్లను మ్యాపింగ్ చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘం రీషెడ్యూల్ నోటిఫికేషన్ ప్రకారం జనవరి 12న 66 డివిజన్లకు సంబంధించిన ఫైనల్ ఫోటో ఎలక్టోరల్ రోల్స్ జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. అభ్యంతరాలు సమర్పించిన వారికి వాటి పరిష్కార వివరాలను లేఖాపూర్వకంగా తెలియజేశామని పేర్కొన్నారు. ప్రచురించిన తుది ఫోటో ఎలక్టోరల్ రోల్స్ జాబితాను నగరపాలక సంస్థ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, అర్బన్ ఎమ్మార్వో కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని 66 డివిజన్ల పరిధిలో 110 లొకేషన్లలో సుమారు 426 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. వీటిలో 14 సమస్యాత్మక, 4 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామని వివరించారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జనవరి 13న పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించి, జనవరి 14న వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. డివిజన్ వారీగా పోలింగ్ బూత్‌ల ప్రకారం ఫోటో ఎలక్టోరల్ రోల్స్‌ను సిద్ధం చేసి, జనవరి 16న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాతో పాటు ఫోటో ఎలక్టోరల్ రోల్స్ తుది జాబితాను విడుదల చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా మిగతా ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## దేశ ఔన్నత్యానికి నిలువెత్తు నిదర్శనం స్వామి వివేకనంద

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో నిర్వహించినటువంటి స్వామి వివేకానంద జయంతి వేడుకలకు సోమవారం మానకొండూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ హాజరై గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్ ( పెద్దన్న) తో కలిసి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలలకు చాటి చెప్పిన మహెూన్నతమైనటువంటి వ్యక్తి , యువతకు ఆదర్శనీయమైన సిద్ధాంతాలను అందించిన దిశాలి వివేకానందుడు అని కొని ఆడారు. మండల యువకులకు జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యువకులు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


## "అవగాహన-అప్రమత్తతే ఇంటి భద్రతకు, సమాజ రక్షణకు నాంది"

**నర్సాపూర్ గ్రామంలో పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం**



సిద్దిపేట / ములుగు, జనవరి 12 (జనతా న్యూస్): సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాధాన్యం వంటి అంశాలపై గ్రామ ప్రజలకు వివరించారు. కళాబృందం సభ్యులు డయల్--100 సేవల వినియోగం, బ్లూ కోల్ట్స్ స్పందన, హెల్మెట్ తప్పనిసరి వినియోగం, మైనర్ రైడింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాల్సిన అవసరం గురించి వివరించారు. బ్యాంకులు ఎప్పుడూ ఓటీపీ అడగవని, అలాంటి కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేశారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్ఐ రఘుపతి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, కనువిప్పు కార్యక్రమం సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచి ఆదేశాలతో గుంతల పూడిచివేత



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని చిలాపూర్ గ్రామంలో గల ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను సోమవారం గ్రామ సర్పంచ్ శానగొండ స్వరూప ఆదేశాలతో , గ్రామ యువకుడు, యువజన కాంగ్రెస్ నాయకులు శానగొండ శరత్ కుమార్ వాహన దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తన సొంత ఖర్చులతో గుంతలు పూడ్చి వేయించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు.

# ముత్తన్నపేటలో చేపల చెరువు భూమి పూజ



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరు చేసిన, చేపల చెరువుకు గ్రామ సర్పంచ్ గుర్రాల అనురాధ బాల నరసింహారెడ్డి లు ఉప సర్పంచ్ మచ్చ కుమార్ తో కలిసి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పవిత్ర, గాజ మంగ, కనగండ్ల చంద్రయ్య, బోయిని అపర్ణ, రజినీకాంత్, శంకరయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి గ్రామపంచాయతీ కార్యవర్గాన్ని సన్మానించిన యువకులు




జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రానికి చెందిన నూతనంగా ఎన్నికైనటువంటి గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని అంబేద్కర్ నగర్ యూత్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. వారికి బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుమతిగా అందించి, మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్ ( పెద్దన్న) ఉప సర్పంచ్ ధూమాల మహేష్ వార్డు సభ్యులు అంబేద్కర్ నగర్ యూత్ సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# గూడెంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు






జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని గూడెం గ్రామంలో పవనపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడెల్లి శ్రీకాంత్, ఉప సర్పంచ్ యాలాల పరుశరాములు పాల్గొని మాట్లాడుతూ యువత వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తమ అనుకున్న లక్ష్యాల వైపు పయనించాలని తద్వారా వ్యక్తిగత అభివృద్ధితోపాటు , దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. అనంతరం బెజ్జంకి పోలీస్ స్టేషన్ కి వెళ్లి త్వరలో తమ గ్రామంలో నిర్వహించే ముగ్గుల పోటీకి గ్రామానికి రావాల్సిందని ఎస్సై సౌజన్యకు ఆహ్వాన పత్రిక అందించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు.

## అనుమతి లేకుండా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ పట్టివేత

**ఎస్సై పృథ్వీధర్ గౌడ్**



చిగురుమామిడి, జనత న్యూస్:చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామ శివారులో సోమవారం ఉదయం ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇందుర్తి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఉదయం సుమారు 8 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో ట్రాక్టర్ నంబర్ టీఎస్ 36 టీ 7982ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌ను నడుపుతున్న డ్రైవర్ బోయిన రవీందర్ (నారాయణపురం గ్రామం)తో పాటు ట్రాక్టర్ యజమాని బండారి రవి (గొట్ల మిట్ట గ్రామం)లను అదుపులోకి తీసుకొని చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు.

# నిర్లక్ష్యం చేస్తే? మరో మారు బెజ్జంకి అన్యాయం తప్పదు

**శాంతియుతంగా పోరాటాన్ని ఉద్ధృతం చేద్దాం.**

**బాపూజీ బాటలో "సత్యం" "అహింస" "సత్యాగ్రహం" అనే ఆర్యసత్యాలను ఆయుధాలుగా చేసుకొని ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు అనుగుణంగా శాంతి మార్గంలో మండలాన్ని సాధించుకుందాం.**

**కరీంనగర్ జిల్లా పోరాట సమితి అఖిలపక్ష నాయకులు.**





జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల కేంద్రంలో సోమవారం కరీంనగర్ జిల్లా పోరాట సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తిరిగి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపడం కోసం అనుసరించాల్సిన కార్యాచరణను చర్చించుకున్నారు. వారి అభిప్రాయాల ప్రకారం , తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం అప్పటి ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి మండలాన్ని రెండు ముక్కలు చేసి, గన్నేరువరం మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపగా, బెజ్జంకి మండలాన్ని ప్రజాభిషానికి వ్యతిరేకంగా బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలపడంతో అప్పటినుండి మండలంలోని అఖిలపక్ష నాయకులు కరీంనగర్ జిల్లా పోరాట సాధన సమితిగా ఏర్పాటు చేసుకుని నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి పిసిసి అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండలాన్ని తప్పకుండా కరీంనగర్ జిల్లాలో కలుపుతామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో మండల ప్రజలకు గుండెల్లో భారం దిగిపోయింది. ఇదే కాకుండా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా చాలా సందర్భాలలో బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపడానికి తన వంతు సహకరిస్తానని మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఇటీవల అసెంబ్లీ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల పునర్విభజన ఉంటుందని ప్రకటన చేయడంతో, మండల సాధన సమితి సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, సీతక్క, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు తమ సుదీర్ఘ ఆకాంక్షను మెమోరాండం రూపంలో అందించి, మండల ప్రజల కష్టాలను వారికి కళ్ళకు కట్టినట్లు వివరించడంతో వారు సహనుకూలంగా స్పందించినప్పటికీ, బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అన్యాయమే, మళ్లీ జరుగుతుందో అనే భయంతో, సోమవారం మండల కేంద్రంలో కరీంనగర్ జిల్లా పోరాట సమితి సభ్యులు, మండలంలోని ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు వెల్లడించి సంగటిత నిర్ణయానికి వచ్చారు. మండలం కరీంనగర్ జిల్లాలో కలిసే వరకు పోరాటాన్ని ఆపవద్దని నిర్లక్ష్యం చేస్తే బెజ్జంకి మండలానికి మరోసారి అన్యాయం తప్పదని, ప్రజాస్వామ్య సిద్ధాంతాల ప్రకారం మహాత్మా గాంధీ చూపిన " సత్యం," "అహింస", "సత్యాగ్రహం" అనే మూడు ఆర్యసత్యాలను ఆయుధంగా చేసుకొని మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలిపే విధంగా పోరాటాలను సంగటితంగా ఉధృతం చేస్తామని బెజ్జంకి లక్ష్మీ నరసింహ స్వామి గుట్ట వద్ద కొబ్బరికాయలు కొట్టి కార్యచరణకు నడుం బిగించారు. ఈ కార్యక్రమంలో మానాల రవి, దోనే వెంకటేశ్వరరావు, దోనే రామారావు, లోనే నరసింగం, బోనగం రాజేశం గౌడ్, వడ్లూరి పరుశరాములు, చేలుకల కొండల్ రెడ్డి, బోనగిరి రూపేష్, సంఘ రవి , శీలం వెంకటేశం, బుర్ర కిషన్ గౌడ్, దొంతర వేణి మహేష్, మైల ప్రభాకర్, గాజ మల్లేశం, భూతల ఉపేందర్, రాక్యం ఆంజనేయులు పాల్గొన్నారు.

# మహాకవి అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళులు



హుస్నాబాద్, జనత న్యూస్:మహాకవి అలిశెట్టి ప్రభాకర్ 72వ జయంతి, 33వ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హుస్నాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, శ్రామికుల పెత్తనం ద్వారా సమాజంలోని దోపిడీ నిర్మూలించినప్పుడే సమాన సమాజం సాధ్యమవుతుందని, ఆ భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడంలో అలిశెట్టి ప్రభాకర్ తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. స్వభావం, సాహసం ఆయనకు ప్రధాన బలాలని పేర్కొన్నారు. పరిష్కారం, ఎర్ర పావురాలు, మంటల జెండాలు, పింజరా, దశ, సిటీ లైఫ్ వంటి రచనల ద్వారా రాజకీయ నాయకుల ద్వంద్వ వైఖరిని, వేశ్యల దుర్భర జీవన పరిస్థితులను, సమాజంలోని అనేక రుగ్మతలను కవిత్వంగా చిత్రీకరించారని తెలిపారు. జగిత్యాలలో మధ్యతరగతి పద్మశాలి కుటుంబంలో జన్మించిన అలిశెట్టి ప్రభాకర్ కవి మాత్రమే కాకుండా చిత్రకారుడు, ఫోటోగ్రాఫర్‌గా కూడా వివిధ వృత్తుల్లో రాణించారని గుర్తు చేశారు. పేదప్రజల పక్షపాతిగా నిలిచిన ఆయన కవిత్వంలో ఒక వేమన, ఒక చెరబండరాజు, ఒక శివసాగర్, ఒక గద్దర్, ఒక శ్రీశ్రీల గర్జన కనిపిస్తుందని వక్తలు పేర్కొన్నారు. అలిశెట్టి ప్రభాకర్ ఆశయాలను నేటి యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, కోడం ప్రభాకర్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, కార్యక్రమ కన్వీనర్ గాజుల భగవాన్ నేత, వడ్డేపల్లి వెంకటరమణ, లక్ష్మీపతి, రాజేశం, నోముల బాలయ్య, సతీష్, కిరణ్, అలువోజు రవీందర్, రాజకుమార్, చింతకింది శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్, కేశవేణి రమేష్‌తో పాటు పద్మశాలి నాయకులు, అన్ని పార్టీల నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# సుందరగిరి పాల సంఘానికి 12వసారి తొలి బహుమతి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పాల ఉత్పత్తిలో అగ్రస్థానం**

**సంక్రాంతి ఉత్సవాల్లో ఘనంగా పురస్కార ప్రదానం**

**పాడి రైతుల కృషికి దక్కిన ఘనతగా అవార్డు**

**నాణ్యత, క్రమశిక్షణకు నిలువెత్తు నిదర్శనం సుందరగిరి సంఘం**




చిగురుమామిడి, జనత న్యూస్:కరీంనగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించిన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పాల ఉత్పత్తిలో సుందరగిరి పాల ఉత్పత్తి సహకార సంఘం వరుసగా 12వ ఏడాదీ తొలి బహుమతిని కైవసం చేసుకొని తన సత్తా మరోసారి చాటింది. నిరంతర కృషి, క్రమశిక్షణ, నాణ్యతకు నిదర్శనంగా ఈ పురస్కారం నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఘన విజయం వెనుక పాడి రైతుల అంకితభావం, సంస్థ పాలకవర్గం సమన్వయం, ఆధునిక నిర్వహణ విధానాలే ప్రధాన కారణాలని తెలిపారు. ప్రతి రోజు నాణ్యమైన పాలను ఉత్పత్తి చేస్తూ, జిల్లా స్థాయిలో ఆదర్శంగా నిలుస్తున్న సుందరగిరి సంఘం రైతు సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతోందని వారు అన్నారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిలో విశిష్ట సేవలందించిన పాడి రైతులకు సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గెలుచుకున్న తొలి బహుమతిని సంస్థ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు డైరీ చైర్మన్ చేతుల మీదుగా స్వీకరించడం గర్వకారణమని తెలిపారు. ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత ఉత్తమ ఫలితాల సాధనకు ప్రేరణగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పిట్టల తిరుపతి, డైరెక్టర్లు గందె రమేష్, గందె శ్రీనివాస్, గండికోట చిన్న శ్రీనివాస్, బట్టు మల్లయ్య, శ్రీమూర్తి శ్రీనివాస్, పెసరి శ్రీనివాస్, పత్తేం రమేష్, గందె రాజు, ఎనగందుల శారదతో పాటు కార్యదర్శి మేడబోయిన శ్రీనివాస్, వెంకటేష్, గంగరాజు, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

### బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రి సూచనలు




కరీంనగర్, జనవరి 13: గత ఏడాదికన్నా ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 29 వరకు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా శోభాయాత్రను ఫిబ్రవరి 1వ తేదీకి మార్చినట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని కోరారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో జిల్లా కలెక్టర్, సీపీ, ఆలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సేవలు అందించాలని మంత్రి సూచించారు. దోనర్లు, అధికారులు, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, కర్ర రాజశేఖర్, మల్లికార్జున రాజేందర్, బానోతు శ్రావణ్ నాయక్, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్నారెడ్డి, వెన్నం రజిత రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, కోటగిరి భూమా గౌడ్, చాడగొండ బుచ్చిరెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల ప్రకాష్, గంట శ్రీనివాస్, పడిశెట్టి భూమయ్య, నెల్లి నరేష్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, కుంభాల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి సంజయ్‌ను కలిసిన సర్పంచ్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామ సర్పంచ్ అశోధ శ్రీనివాస్, పలువురు వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను సోమ వారం ఉదయం కరీంనగర్ లోని శక్తి టెంపుల్ లో కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ను కేంద్ర మంత్రి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కల్సికట్టుగా గ్రామాభివృద్ధి చేసుకోవాలని వారికి మంత్రి సూచించారు. గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి కి సర్పంచ్ వినతి పత్రం సంపర్పించారు.

గ్రామంలో రామాలయం పునరుద్ధరణకు, యాదవ సంఘం ప్రహరీ గోడ, బోర్ వెల్, మోటార్ మంజూరి ఇవ్వాలని, ఆరెల్లి వెంకటేష్ ఇంటి నుండి పశువుల ఆసుపత్రి వరకు మెయిన్ రోడ్డు వెంట డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణం కు నిధులు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ ను సంజయ్ సన్మానించి అభినందనలు తెలిపారు. సర్పంచ్ అసోద శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తోడెంగ కోమురయ్య, వార్డు సభ్యులు పాకకుల చొక్కయ్య, కిన్నెర భూమయ్య, జంకిటి వంశీకృష్ణ, అసోద రాజయ్య, నాంపెల్లి సత్తయ్య. బిజెపి నాయకులు కిన్నెర అనిల్ కుమార్, వెలుగు మధు తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలి: ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

### చీఫ్ మినిస్టర్ టార్చ్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే



పెద్దపల్లి, జనవరి 13: యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. జిల్లా యువజన మరియు క్రీడా ప్రాధికార సంస్థ పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ టార్చ్ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి స్థానిక అయ్యప్ప దేవాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, యువతలో క్రీడల పట్ల అవగాహన పెంచడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు క్రీడలను విస్తృతంగా ప్రోత్సహించేందుకు రెండో ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్--2025లో భాగంగా ఈ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టార్చ్ ర్యాలీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యువత క్రీడల్లో ముందుకు రావాలని, తెలంగాణ పేరును జాతీయ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, యువత, పలు క్రీడా సంస్థల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగిసిన "అల్ఫోర్స్ క్రికెట్ ఛాంపియన్షిప్

### విజేతగా అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, కొత్తపల్లి




కొత్తపల్లి, జనవరి 13:స్థానిక ఎస్ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా ఉత్సాహంగా, ఉత్కంఠగా సాగిన "అల్ఫోర్సు క్రికెట్ ఛాంపియన్షిప్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, కొత్తపల్లి జట్టు విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి అని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు మరింత ఉత్సాహంగా, క్రమశిక్షణతో తమ లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనడమే కాకుండా నైపుణ్యం సాధించే విధంగా శిక్షణ పొందాలని, వివిధ స్థాయిల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ అవసరమైన ప్రోత్సాహం, వనరులు అందించాలని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేలా ఇలాంటి పోటీలను నిరంతరం నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి టోర్నమెంట్లు కొనసాగిస్తామని డాక్టర్ నరేందర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, కొత్తపల్లి జట్టు సభ్యులను ఆయన అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద జయంతి వేడుకలు

### జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన తెలంగాణ యువజన సమితి



కరీంనగర్, జనవరి 13 (జనతా న్యూస్): స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం తెలంగాణ యువజన సమితి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్‌లో గల స్వామి వివేకానంద విగ్రహానికి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థి, యువజన, స్వచ్ఛంద సేవా, క్రీడా రంగాలు, మహిళా సంఘాల్లో స్వచ్ఛందంగా సేవలందించిన వారికి విశిష్ట అతిథుల చేతుల మీదుగా యువ సేవా పురస్కారం 2025--26 అవార్డులను ప్రధానం చేశారు. సమాజ సేవలో చురుకుగా పాల్గొంటున్న యువతను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయిన్పల్లి వినోద్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, కరీంనగర్ జిల్లా యువ సేవా పురస్కార్--2026 అవార్డు చైర్మన్, భారత రాష్ట్ర సమితి పార్టీ సిటీ అధ్యక్షులు చల్ల హరిశంకర్, తెలంగాణ యువజన సమితి కరీంనగర్ జిల్లా కన్వీనర్ వొడ్నాల రాజు, జిల్లా అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్, కో--కన్వీనర్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపల్ ఓటర్ల తుది జాబితా విడుదల



హుస్నాబాద్,జనత న్యూస్: మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ సోమవారం విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఫోటోలతో కూడిన ఓటర్ జాబితాను ఆయన అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్లు 19,227 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో 9,348 మంది పురుషులు, 9,873 మంది మహిళలు కాగా, ఇతరులు ఆరుగురు ఉన్నారని వెల్లడించారు. 20 వార్డులకు గాను మొత్తం 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రచురించిన ఈ ఓటర్ జాబితానే తుది జాబితా అని, ఇకపై ఎలాంటి మార్పులు ఉండవని కమిషనర్ స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారం కోసం పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి

### బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్



కరీంనగర్, జనత న్యూస్: పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన పద్మశాలి ప్రజాప్రతినిధులకు నిర్వహిస్తున్న సన్మాన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో నూతనంగా ఉపసర్పంచ్‌గా ఎన్నికైన బింగి రాజేంద్ర ప్రసాద్‌తో పాటు 4వ వార్డు సభ్యులు బింగి మాధవి గణేష్, రమంచ వార్డు సభ్యులు వెల్దండి పద్మ, రేకొండ వార్డు సభ్యులు కారంపూరి తారలను జక్కని సంజయ్ కుమార్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి వోడ్నాల రవీందర్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పద్మశాలి కులస్తులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికైన ప్రజాప్రతినిధులను అభినందించారు. తదనంతరం జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర జనాభాలో 28 లక్షలకు పైగా ఉన్న పద్మశాలి కులస్తులు విద్య, వైద్య, వస్త్ర ఉత్పత్తి రంగాలతో పాటు అనేక రంగాల్లో నైపుణ్యంతో సేవలందిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో పద్మశాలీలు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరైన సహకారం లేకపోవడం వల్ల రాజకీయంగా కేవలం కొద్దిమంది మాత్రమే ఎదిగారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 28 లక్షల మంది పద్మశాలీలు ఉన్నప్పటికీ ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉండడం కుల వెనుకబాటుతనానికి నిదర్శనమని అన్నారు. గ్రామీణ స్థాయిలో సేవాభావంతో ముందుకు వచ్చి వార్డు సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులుగా ఎన్నికైన పద్మశాలి ప్రజాప్రతినిధులకు జిల్లా వ్యాప్తంగా సన్మానాలు నిర్వహిస్తూ వారిలో రాజకీయ స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు. పద్మశాలీల ఐక్యతే భవిష్యత్ రాజకీయ బలమని, ఆ దిశగా బీసీ ఆజాది ఫెడరేషన్ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం కార్యనిర్వహక కార్యదర్శి వోడ్నాల రవీందర్, మండల అధ్యక్షులు వంగర మల్లేశం, ఉపసర్పంచ్ బింగి రాజేంద్ర ప్రసాద్, కొండాపూర్ గ్రామ అధ్యక్షులు బింగి శివలింగం, యువజన అధ్యక్షులు బింగి వెంకటేష్, మాజీ మండల ఉపాధ్యక్షులు బింగి లక్ష్మీనారాయణ, బింగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# 500 మంది బ్రాహ్మణులకు నిత్యావసర సరుకుల పంపిణీ

### బ్రాహ్మణ సేవా వాహిని సేవలకు ప్రశంసలు



హనుమాన్‌పేట్, జనవరి 12: బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో 500 మంది బ్రాహ్మణులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల చారి గారు లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు, బ్రాహ్మణ చిన్న వ్యాపారులకు, పురోహితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. బ్రాహ్మణ సేవా వాహిని చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు బ్రాహ్మణులు ప్రశంసించారు. ముఖ్య అతిథి వేణుగోపాల చారి గారు మాట్లాడుతూ, బ్రాహ్మణ సేవా వాహిని గత ఏడు సంవత్సరాలుగా నిరంతరంగా బ్రాహ్మణులకు సేవ చేస్తూ తెలంగాణలో ప్రత్యేక సంఘంగా గుర్తింపు పొందిందని అన్నారు. బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు రఘు కిరణ చార్యులు మాట్లాడుతూ, బ్రాహ్మణులు ఎదుర్కొనే సమస్యలను ముందుండి పరిష్కరిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. బ్రాహ్మణ సేవా వాహిని (దీ౦) ఫౌండర్ మరియు అధ్యక్షులు రఘు కిరణ చార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, పురోహిత అర్చక విభాగం ప్రతినిధులు, మహిళా వాహిని (మీ౦) అధ్యక్షులు, కన్వీనర్లు, ఉపాధ్యక్షులు, సలహాదారులు, గ్రేటర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

### పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి, జనవరి 13 (జనత న్యూస్): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, పేదల సంక్షేమమే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని 6, 7, 8, 9, 12, 26, 27, 28 మరియు 29 వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నూతన నిర్మాణాల కోసం స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ శంకుస్థాపనలు నిర్వహించి, ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణంలో పలు వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి, మంజూరు పత్రాలు అందజేశామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మరియు బందంపల్లి రాజీవ్ రహదారి వద్ద నూతన హై మాక్స్ లైట్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాసవి వనితా వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



కరీంనగర్, జనతా న్యూస్: స్థానిక భగత్‌నగర్ పెద్దమ్మ దేవాలయం ఆవరణలో వాసవి వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తొలుత వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈసీ అధికారి జంధ్యం మాధవి దంపతులు, ఐపీసీ పబ్బ అరుణ, రీజినల్ చైర్‌పర్సన్ సూర గీతా, రీజియన్ కార్యదర్శి మాడిశెట్టి ఉమాదేవి, జోనల్ ఛైర్‌పర్సన్ భారతీ విశిష్ఠ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు వారు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ముందుగా వాసవి మాత జీవిత చరిత్ర పారాయణం చేయగా, ముగ్గుల పోటీల్లో దాదాపు 20 మంది పాల్గొని చక్కని సంక్రాంతి ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడంతో పాటు కన్సోలేషన్ బహుమతులు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో భాగంగా పతంగుల ఎగురవేత, చిన్నపిల్లలకు భోగి పండ్లు పోయడం, భోగి మంటల కార్యక్రమం నిర్వహించారు. అలాగే సేవా కార్యక్రమంలో భాగంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి వనిత వాగ్దేవి పేరుతో రూపొందించిన బ్యాడ్జిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గంప హరిణి, కోలేటి విశాల, ట్రెజరర్ సమత, పూర్వ అధ్యక్షులు రూప శ్రీ, కార్యదర్శి వొజ్జల రాజమణి తదితర క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లా అండ్ ఆర్డర్ పై స్పెషల్ ఫోకస్

### యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్



యాదగిరిగుట్ట : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయమని, ఇందుకోసం స్పెషల్ ఫోకస్ పెట్టామని యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు. యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ ను సోమవారం ఆయన సందర్శించారు. అబశ్రీశ్రీఎస్పీ హెూదాలో ఫస్ట్ టైం యాదగిరిగుట్ట పీఎస్ కు వచ్చిన అక్షాంశ్ యాదవ్ కు యాదగిరిగుట్ట డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట పట్టణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిలయం కావడంతో.. భక్తుల రక్షణార్థం ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా అబశ్రీశ్రీప్రశాంత వాతావరణంలో ఫ్యామిలీతో కలిసి స్వామివారిని దర్శించుకునేలా భక్తుల పట్ల భద్రతాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ క్రైం, గంజాయి నివారణ, నేరాల సంఖ్యను తగ్గించడానికి ఇప్పటికే చర్యలు చేపడుతున్నామని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట టౌన్ సీఐ భాస్కర్, రూరల్ సీఐ శంకర్ గౌడ్, ఎస్ఐలు యాదయ్య, సైదులు, రూపాశ్రీ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం నుంచి మైలారం గ్రామానికి బోటు సౌకర్యం ప్రారంభం

### భక్తులకు సౌకర్యంగా 3 రోజుల పాటు బోటు సేవలు



కరీంనగర్, జనవరి 13 (జనతా న్యూస్):
కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం నుంచి కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామానికి వెళ్లేందుకు బోటు సౌకర్యాన్ని సోమవారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైలారం గ్రామంలో ఈ నెల 16 నుంచి 18 వరకు శ్రీ భ్రమరాంబ సమేత స్వయంభు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలతో పాటు మహా రుద్ర యాగం కూడా నిర్వహించనున్న నేపథ్యంలో కరీంనగర్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మైలారం వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారని అన్నారు. కరీంనగర్ నుంచి మైలారం గ్రామానికి రోడ్డు మార్గంలో వెళ్లాలంటే సుమారు 45 నిమిషాల సమయం పడుతుందని, అదే బోటు ద్వారా ప్రయాణం చేస్తే కేవలం 20 నిమిషాల్లోనే మైలారం చేరుకోవచ్చని తెలిపారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లోయర్ మానేరు డ్యామ్‌లో బోటు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మహా జాతర సందర్భంగా భక్తులకు త్వరగా వెళ్లి వచ్చేందుకు అవకాశం కల్పించాలని టూరిజం శాఖను కోరగా, వారు బోటు నడపడానికి అనుమతులు ఇచ్చారని చెప్పారు. ఈ బోటు సేవలు ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు కొనసాగుతాయని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మామిడాల నాగసాయి శర్మ మాట్లాడుతూ, 16వ తేదీన గోపూజ, గురువందనం, గణపతి పూజ, పుణ్యాహవచనం, 17వ తేదీన ఊరేగింపు కార్యక్రమం, 18వ తేదీన మల్లన్న పెద్దపట్నం, కేతకి మేడ లమ్మ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహెూత్సవం, మల్లన్న అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ వరాల పరశురాములు, మాజీ సర్పంచ్ జక్కనపల్లి సత్తయ్య, నాయకులు తోట కోటేశ్వర్ పటేల్, నేతిరవి వర్మ, దుద్దేల శ్రీధర్, మిడిదొడ్డి నవీన్, నూకల నాగరాజు, నందెల్లి సన్నీతో పాటు ఆలయ కమిటీ బాధ్యులు, టూరిజం శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

### యువతకు స్ఫూర్తిదాయకం వివేకానంద జీవితం



కరీంనగర్, జనవరి 13 (జనతా న్యూస్): స్వామి వివేకానంద 164వ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అఖిలభారతీయ గ్రాహక పంచాయతీ ఆధ్వర్యంలో కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ లోని గ్రంథలయం, సీనియర్ సిటిజన్ కార్యాలయాల ఆవరణలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద స్వామి చిత్రపటానికి అఖిలభారతీయ గ్రాహక పంచాయతీ అధ్యక్షులు నలువాల రాజేందర్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానంద జీవితం యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని, ఆయన బోధనలు నేటి యువత తప్పనిసరిగా అనుసరించాల్సినవని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు స్వామి వివేకానంద బోధనలు, ఆశయాలపై ప్రసంగించారు. 7వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాశ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సుదర్శన్, రామకృష్ణ మిషన్ ధ్యాన శిక్షకులు మాస్టర్ రామకృష్ణ రెడ్డి, యువనేత ఉదయ్ తదితరులు మాట్లాడుతూ, స్వామి వివేకానంద సందేశాలను యువత గుండెల్లో నింపుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ కమిటీ అధ్యక్షులు చందా సుధాకర్, వివేకానంద యూత్ సభ్యులు స్పందన్, సంజీవ్, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మీనారాయణ, గూడెల్లి రాజకుమార్, తోట సాగర్, తోట సతీష్, అఖిలభారతీయ గ్రాహక పంచాయతీ ఉపాధ్యక్షులు గంద్ర సత్యనారాయణ రావు, కార్యదర్శి సురభి శ్రీధర్, జిల్లా కార్యనిర్వాహకుడు నాగమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పతంగుల పండగకు సర్వం సిద్ధం



హైదరాబాద్ : సికింద్రాబాద్ పరేడ్ మైదానం సంక్రాంతి శోభను సంతరించుకుంది. అంతర్జాతీయ పతంగులు, మిఠాయిల పండగను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఉత్సవాలను మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నారు.

తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 13 నుంచి ఈ నెల 15 వరకు ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ సరదాల సంక్రాంతి ఉత్సవాల్లో ప్రజలకు కావల్సిన వినోదం సహా పసందైన రుచులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 55 నేషనల్ కైట్ ఫ్లయర్స్ పాల్గొననున్నారు. సాధారణ గాలిపటాల కన్నా భారీ పరిమాణంలోఉన్న వివిధ ఆకృతుల్లో తయారు చేసిన పతంగులు ఎగురవేయనున్నారు. రాత్రి వేళ ఎగిరే పతంగులు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

పతంగుల పండతో పాటు కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ (CLIC) సహకారంతో స్వీట్ ఫెస్టివల్ ను కూడా నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంప్రదాయ వంటలు, పంజాబ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, కేరళ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు తమ ఇంట్లోనే తయారు చేసిన పలు రకాల స్వీట్లను ఫుడ్ కోర్టులోని 60 స్టాళ్లలో ప్రదర్శించి, విక్రయించనున్నారు. చేనేత, హస్తకళల 100 స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేశారు. భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చనున్నాయి.

హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ మరింత పెంచే విధంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అదేశించారు. సందర్శకులకు ఎలాంటి లోటు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యారికేడింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్, అగ్నిమాపక వ్యవస్థ, బందోబస్తు, మంచినీటి సరఫరా, వైద్యసేవలు అందివ్వాలని చెప్పారు. హైడ్రా పునరుద్ధరించిన చెరువుల వద్ద కూడా ఈసారి పతంగులను ఎగరవేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇలాంటి ఉత్సవాల ద్వారా పర్యాటకులను ఆకర్షించడంతోపాటు పర్యాటకంగా నగరం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

**కార్యక్రమాల వివరాలు**

1. అంతర్జాతీయ కైట్ & స్వీట్ ఫెస్టివల్ ( జనవరి 13–15)
వేదిక: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్
సమయం: ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు

2. హాట్ ఎయిర్ బలూన్ ఫెస్టివల్ (జనవరి 16–18)
వేదిక: పరేడ్ గ్రౌండ్స్
సమయం: సాయంత్రం 4:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు

3. డ్రోన్ ఫెస్టివల్ (జనవరి 16–17)
వేదిక: గచ్చిబౌలి స్టేడియం
సమయం: ఉదయం 9:30 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com